ఇక ఇంటి నుంచే యూరియా బుకింగ్



2






2

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ బృందం



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## తెయూ పరిధిలో బీఎడ్ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

**అక్షరటుడే, ఇందల్వాయి:** తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో బీఎడ్ పరీక్షలకు సంబంధించి ఫీజు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.సంపత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2026 విద్యా సంవత్సరానికి గాను.. బీఎడ్ ఒకటో, మూడో సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థులకు, బ్యాక్ లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 27వ తేదీలోపు చెల్లించాలని సూచించారు. అలాగే రూ.100 ఫైన్‌తో 29వ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం తెయూ వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.





## ‘మీ డబ్బు మీ హక్కు’ను సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, ఇందూరు :** వివిధ కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల కోసం అందుబాటులోకి తెచ్చిన ‘మీ డబ్బు మీ హక్కు’ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ‘మీ డబ్బు..మీ హక్కు’ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆర్థిక రంగంలో క్లెయిమ్ చేయని ఆస్తుల పరిష్కారం కోసం నవంబర్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31వరకు ‘డబ్బు.. మీ హక్కు’ కార్యక్రమాన్ని కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమకు చెందాల్సిన అన్ క్లెయిమ్ బ్యాంకు డిపాజిట్లు, షేర్లు, డివిడెంట్లు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు, బీమా రాబడులు తదితర ఆర్థికపరమైన ఆస్తులను తిరిగి క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. ఆర్థికపరమైన ఆస్తులపై హక్కు కలిగిన వారు ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత బ్యాంకులు, ఆర్థిక సంస్థలను సంప్రదించి తమ నిధులను తిరిగి క్లెయిమ్ చేసుకోవాలని సూచించారు. బ్యాంకుల్లో పదేళ్లకు పైగా క్లెయిమ్ చేయని డిపాజిట్ల వివరాలు ఆర్‌బీఐ ఉద్గం వెబ్‌సైట్‌లో చూసుకొని సులభంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఎల్డీవో రాములు, ఎస్ఎల్‌సీ మేనేజర్ ప్రకాష్, ఎస్‌బీఐ ఆర్ఎం మహేశ్వర్, ఏజీఎం రవికిరణ్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి ముగిసి, నూతన పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నాయి. సర్పంచ్‌గా గెలవాలనే లక్ష్యం నెరవేరినా, పెండింగ్‌లో ఉన్న పనులు, నిధుల కొరత కొత్త పాలకులకు సవాలుగా మారాయి. ఈ తరుణంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ – గ్రామీణ్ (వీబీ జీ రామ్ జీ) పల్లెల అభివృద్ధికి ఒక సంజీవనిలా కనిపిస్తోంది. గతంలో ఉపాధి హామీ పథకం పేరును కేంద్రం మార్చిన విషయం తెలిసిందే. దీంతో కూలీలకు పని కల్పించడమే కాకుండా, గ్రామ మౌలిక సదుపాయాలను మెరుగుపరుచుకోవడానికి ఈ పథకం ఒక గొప్ప వేదిక కానుంది.

- భీమ్‌గల్ అక్షరటుడే

# గ్రామాభివృద్ధికి హామీ

▸ ఉపాధి హామీతో నిధుల కొరతకు చెక్ ▸ పథకంలో మార్పులతో పెరగనున్న పనిదినాలు ▸ అభివృద్ధికి పెద్దపీట

ప్రభుత్వం ఈ పథకంలో కీలక మార్పులు చేస్తూ పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచింది. సుమారు 266 రకాల పనులను గుర్తించి, గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తోంది. జిల్లాలోని 541 పంచాయతీల పరిధిలో ఉన్న 2.51 లక్షల జాబ్‌కార్డు దారులకు ఇది ఒక సువర్ణావకాశం.

### అభివృద్ధికి పంచ సూత్రాలు

భూగర్భ జలమట్టం పడిపోతున్న ప్రస్తుత తరుణంలో సాగు భూముల్లో కాంటూరు కందకాలు, ఊట కుంటలు, ఫామ్ పాండ్స్ నిర్మించుకోవచ్చు. దీంతో వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ ఉండి, బావులు, బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది.

ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మాణంతో పాటు, గ్రామంలోని మురుగునీటి నిర్వహణకు ఈ నిధులను వాడుకోవచ్చు. వ్యక్తిగత మరుగుదొడ్ల గుంతల తవ్వకానికి కూలీల ఖర్చును పథకం ద్వారా భరించడంతో పేద కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతుంది.

గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, వాటి పోషణకు అయ్యే ఖర్చును ఉపాధి పథకం భరిస్తుంది. ఇది గ్రామాన్ని పచ్చదనంతో నింపడమే కాకుండా, పర్యావరణాన్ని కాపాడుతుంది.

సొంత భవనాలు లేని పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు 'ఉపాధి' నిధులతో భవన నిర్మాణ భాగస్వామ్యం కల్పించుకోవచ్చు. దీనివల్ల ప్రభుత్వ భవనాలు అందుబాటులోకి వస్తాయి.

పంట పొలాలకు వెళ్లేందుకు దారులు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి 'పొలం బాటలు' నిర్మించవచ్చు. ఇవి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు తిరగడానికి అనువుగా ఉండి, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరుస్తాయి. గేదెలు, మేకల, పందుల షెడ్లు , పౌల్ట్రీఫాం షెడ్ల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం తదితర వ్యక్తిగత ఆస్తుల పెంపుదలకు ఎంతగానో ప్రాధాన్యం ఇస్తున్నారు.

### సర్పంచులు ఏం చేయాలి?

జిల్లాలో కేటాయించిన 30 లక్షల పని దినాల్లో ఇప్పటి వరకు 15.45 లక్షలు మాత్రమే పూర్తయ్యాయి. అంటే ఇంకా సగం కంటే ఎక్కువ అవకాశం అందుబాటులో ఉంది. నూతన సర్పంచులు కేవలం ప్రభుత్వ గ్రాంట్ల కోసం వేచి చూడకుండా క్షేత్ర సహాయకులు, ఏపీఓలతో సమన్వయం చేసుకోవాలి. గ్రామ సభలు నిర్వహించి అత్యవసరమైన పనులను గుర్తించాలి. కూలీలకు పని కల్పించడం ద్వారా వలసలను నిరోధించవచ్చు. ఉపాధి నిధులతో గ్రామంలో అవసరమైన పనులు చేపట్టాలి.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి తొలగింపు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కాంగ్రెస్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడిని పదవి నుంచి తొలగిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు. ‘ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేటలో జరిగిన సంఘటన నా మనసును తీవ్రంగా కలిచి వేసింది. ఆ దుర్ఘటనలో గాయపడిన వారి బాధను కళ్లారా చూసినప్పుడు మనసు ఎంతో వేదనకు గురైంది. నేను స్వయంగా ఆస్పత్రికి వెళ్లి వారికి పరామర్శించడం జరిగింది. వారు త్వరగా కోలుకొని తమ కుటుంబాలతో కలిసి మళ్లీ సాధారణ జీవితాన్ని గడపాలని మనస్ఫూర్తిగా ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని’ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ‘ఈ ఘటనకు సంబంధించి పోలీసుల విచారణ కొనసాగుతోందని.. ప్రజల్లో న్యాయం పట్ల నమ్మకం నిలబెట్టడం మా బాధ్యత.. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపై ఆరోపణలు వస్తున్న సందర్భంగా.. నైతిక బాధ్యతగా వారిని మండల అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకోవడం జరిగిందని’ పేర్కొన్నారు.



## క్రీడలతోనే మానసిక దృఢత్వం

**అక్షరటుడే, భీమ్‌గల్ :** క్రీడలు జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను సమానంగా స్వీకరించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆటలు మానసిక ధైర్యాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. భీమ్‌గల్ మండల కేంద్రంలో శనివారం ఎస్‌జీఎఫ్ అంతర పాఠశాలల క్రీడాపోటీలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

### క్రీడలే భవిష్యత్తుకు బాటలు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను తిలకించి.. వారినుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ.. ‘క్రీడలు విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. గ్రామీణస్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగిన ఎందరో క్రీడాకారులు మనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. క్రీడల వల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుందని.. శరీరం మన ఆధీనంలో ఉంటుందని వెల్లడించారు. నేటి యువత గంజాయి వంటి వ్యసనాల బారిన పడకుండా ఉండాలంటే వారిని క్రీడల వైపు మళ్లించాల్సిన అవసరం ఉంది’ అని వేముల పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యాసాగర్ రెడ్డి, రాజ్‌కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ నోట్ల ముఠా సభ్యులపై పీడీ యాక్టు

**అక్షరటుడే, కామారెడ్డి:** అంతర్ రాష్ట్ర నకిలీ నోట్ల ముఠా సభ్యులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. భవిష్యత్తులో చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించకుండా కట్టడి చేస్తున్నారు. ఈ మేరకు నిందితులపై పీడీ యాక్టులు నమోదు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే ఆరుగురిపై పీడీ యాక్టు నమోదు చేసిన పోలీసులు.. తాజాగా మరొక ఇద్దరు ముఠా సభ్యులపై పీడీ యాక్టు నమోదు చేసి ఉత్తర్వుల కాపీని నిజామాబాద్ జైలులో ఉన్న నిందితులకు అందజేశారు. ముఠాలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మనహరన్ లహరి, నందలాల్ జాంగ్డేలపై నమోదైన పీడీ యాక్టు ఉత్తర్వులను నిజామాబాద్ జైలులో నిందితులకు పట్టణ సీఐ నరహరి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. నకిలీ కరెన్సీ చలామణి ద్వారా ప్రజల్లో భయం, ఆర్థిక అస్థిరత సృష్టించే వారిని అరికట్టడంలో పీడీయాక్ట్ కీలకమైన చట్టమన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం నిందితులు ఒక ఏడాది వరకు బెయిల్ లేకుండా జైల్లోనే నిర్బంధంలో ఉండనున్నారని తెలిపారు. నకిలీ కరెన్సీ నేరాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు జిల్లా పోలీసులు ఉక్కుపాదంతో వ్యవహరిస్తున్నారని, ఇటువంటి తీవ్రమైన ఆర్థిక నేరాలపై ఎటువంటి సడలింపు ఉండదని ఎస్పీ రాజేష్ చంద్ర స్పష్టం చేశారు.

## బీజేపీ సీనియర్ నాయకుడు మృతి



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ అర్బన్ బీజేపీ సీనియర్ నాయకుడు బట్టిగిరి ఆనంద్ (45) కన్నుమూశారు. శనివారం వేగువ జామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయన నగరంలోని 7వ డివిజన్ శక్తి కేంద్రం ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. బీజేపీ నాయకుడి ఆకస్మిక మృతితో పార్టీలో విషాదఛాయలు నెలకొన్నాయి. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా అనుచరుడిగా ఉంటూ పార్టీలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ఆనంద్ మృతి పట్ల ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా విచారం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆనంద్ మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు.

## మోతె అటవీప్రాంతంలో చిరుత కలకలం..

**అక్షరటుడే, లింగంపేట :** లింగంపేట మండలం మోతె గ్రామంలో చిరుత సంచారం కలకలం సృష్టించింది. శుక్రవారం రాత్రివేళ గ్రామానికి చెందిన గొల్ల మల్లేశ్‌కు చెందిన లేగదూడపై దాడి చంపేసినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాత్రి సమయంలో పంట కాపులకు రైతులు వెళ్తారని.. చిరుత సంచరించడంతో భయాందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. లేగదుడపై చిరుత దాడి చేయడంతో అటవీశాఖ సిబ్బంది గ్రామానికి చేరుకుని ఆనవాళ్లను సేకరించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎఫ్ఆర్‌వో చరణ్ మాట్లాడుతూ.. గ్రామ శివారులో పెద్దపులి సంచరిస్తున్నట్లు వదంతులు వస్తున్నాయన్నారు. పెద్దపులి కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో సంచరిస్తుందని, దానిని ట్రాక్ చేయడానికి ఆరుగురు సిబ్బంది ప్రత్యేకంగా పులి వేటలోనే ఉన్నట్లు తెలిపారు. రైతులు ఈ వదంతులను నమ్మవద్దని సూచించారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు: కలెక్టర్

**అక్షరటుడే, ఇందూరు:** రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. నగర శివారులో తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యధిక మరణాలు చోటు చేసుకుంటున్న వాటిలో నగరంలోని బోధన్ రోడ్డు ఎన్ఎన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ ప్రాంతం రాష్ట్రంలోనే 20వ స్థానంలో ఉందన్నారు. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రమాదాల నివారణ కోసం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించిన ప్రదేశాల్లో రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు జరిపించాలని ఆర్‌అండ్‌బీ, పోలీస్ అధికారులకు సూచించారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలన్నారు. మాణిక్ బండార్ సమీపంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని రహదారులపై బ్లాక్ స్పాట్లను గుర్తించిన ప్రదేశాల్లో ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. మూలమలుపులు, కల్వర్టులు, ఎత్తుపల్లాలు, రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడం వంటి వాటిని సరి చేయాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్టీసీ, ప్రైవేటు వాహనాల ఆపరేటర్లకు, డ్రైవర్లకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ అంకిత్, అదనపు డీసీపీ బస్వా రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఎంవీఐ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ అధికారి ప్రవీణ్ తదితరులున్నారు.

## ఉద్యోగులు కొట్టుకున్న ఘటనపై విచారణ

**అక్షరటుడే, బోధన్ :** బోధన్ మున్సిపల్ కార్యాలయంలోనే ఉద్యోగులు కొట్టుకున్న ఘటనను ‘అక్షరటుడే’ వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ‘మున్సిపల్ కార్యాలయంలోనే కొట్టుకున్న ఉద్యోగులు’ శీర్షికతో కథనం ప్రచురితం కాగా.. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. బల్దియాలోనే ఉద్యోగులు తగువులాడడంపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సైతం సీరియస్ అయినట్లుగా తెలిసింది. దీనిపై విచారించాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్‌ను పురమాయించినట్లుగా సమాచారం. దీనిపై శుక్రవారం ఆయన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. మున్సిపల్ రికార్డులతో పాటు ఉద్యోగులు కొట్టుకున్న ఘటనపై కూడా విచారణ చేపట్టారు. ఉద్యోగులు కొట్టుకున్న ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు సదరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లుగా సమాచారం. వారంరోజుల్లోగా వివరణ ఇవ్వాలని వారికి సూచించినట్లుగా తెలిసింది. దీనిపై సంతృప్తి చెందని పక్షంలో వారిని సస్పెండ్ చేసే అవకాశాలున్నట్లు సమాచారం.







## బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరాం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సోమార్‌పేట్ ఘటనలో గాయపడ్డ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని యశోద ఆస్పత్రి వైద్యులను కోరినట్లు మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. ఈ ఘటనలో గాయపడ్డ గంజి భారతి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం పరామర్శించారు. కేటీఆర్ ఆదేశాల మేరకు ఆస్పత్రికి వెళ్లినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆస్పత్రి వైద్యులతో మాట్లాడగా.. ఇప్పటికే భారతికి మూడు శస్త్రచికిత్సలు అయ్యాయని.. మెరుగైన చికిత్స అందజేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సోమార్‌పేట్ గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ.. తానున్నానని అధైర్యపడొద్దని ధైర్యం చెప్పారు. ఘటనకు కారణమైన కాంగ్రెస్ నాయకులకు శిక్ష పడేదాకా వదిలిపెట్టేది లేదని ఆయన పేర్కొన్నారు. అప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ బాధితులకు పూర్తి అండగా నిలుస్తుందని ఆయన వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే వెంట నాగిరెడ్డిపేట్ జడ్పీటీజీ మాజీ సభ్యుడు మనోహర్ రెడ్డి తదితరులున్నారు.



## విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో శనివారం బ్రహ్మంగారి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వడ్ల కాశీరాం చారి, ఉపాధ్యక్షుడిగా వీరేశం చారి, ప్రధాన కార్యదర్శిగా కమ్మరి నారాయణ చారి, కోశాధికారిగా వడ్ల మురళి చారి, సహాయ కార్యదర్శిగా కమ్మరి భాస్కర్ చారి, సలహాదారులుగా వడ్ల రామచందర్ చారి, సంగయ్య చారి, అశోక్ చారిలను ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి కోసం నూతన సంఘం సభ్యులు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఈవ్ టీజింగ్ చేస్తే షీటీంకు సమాచారమివ్వాలి




**అక్షరటుడే, ఆర్మూర్:** ఎవరైనా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్ చేసినా వెంటనే షీటీంకు సమాచారం ఇవ్వాలని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ అన్నారు. పట్టణంలోని మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సబ్ డివిజన్ షీటీం కానిస్టేబుళ్లు, విగ్నేష్, సుమతి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. ఈవ్‌టీజింగ్ చట్టరీత్యా నేరమన్నారు. విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈవ్ టీజింగ్‌కు గురయితే భయపడకుండా సమాచారం ఇస్తే పోలీస్‌శాఖ తరపున రక్షణ కల్పిస్తామన్నారు. షీటీం నంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా షీ టీంకు ఫిర్యాదు చేసే విధానాన్ని విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఎంఎస్‌వీ ప్రసాద్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## తల్లిదండ్రులు, టీచర్లు గర్వపడేలా ఎదగాలి

**అక్షరటుడే, బోధన్ :** తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలని 'మేము సైతం స్వచ్ఛంద సంస్థ' వ్యవస్థాపక అధ్యక్షుడు నవీన్ కుమార్ సూచించారు. బోధన్ పట్టణంలోని ఏరాజ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు నిఘంటువులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తాము చదువుకుంటున్న పాఠశాలకు పేరు తేవాలని సూచించారు. తమ సంస్థ ద్వారా 15 ఏళ్లుగా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమలత, కాట్ర గడ్డ భారతి, ఉదయలక్ష్మి, శ్రీలక్ష్మి, సునీత, యామిని, చంద్రశేఖర్, సంస్థ సభ్యులు నితిన్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## చెట్టును ఢీకొన్న కారు.. ఇద్దరు యువకులకు గాయాలు

**అక్షరటుడే, ఇందల్వాయి:** అదుపు తప్పి చెట్టుకు కారు ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. ఇందల్వాయి మండలం డొన్కల్ గ్రామంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జక్కుల లింగం, సంజీవరెడ్డి అనే ఇద్దరు యువకులు కారులో ఇందల్వాయి నుంచి డొన్కల్ గ్రామానికి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. భారీ శబ్దం రావడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. వెంటనే ఇళ్లలో నుంచి బయటకు వచ్చి చూడగా.. కారులో ఉన్న ఇద్దరు తీవ్ర గాయాలతో కనిపించారు. గ్రామస్థులు వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

యూరియా కోసం రైతులు భారీగా క్యూలైనల్లో నిలబడి ఇబ్బందులు పడుతుంటారు. మరికొన్నిచోట్ల సమయానికి ఎరువులు దొరకక గొడవలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రైతులు యూరియాను ఇంటి నుంచి బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించనుంది. రైతుల ఇబ్బందులకు స్వస్తి చెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ యాప్ ద్వారా రైతులకు యూరియా అందించనుంది. కొద్ది రోజులుగా జిల్లా వ్యవసాయ అధికారులు డీలర్లకు ఈ యాప్‌పై శిక్షణ పూర్తి చేశారు. ఈ సౌకర్యం శనివారం నుంచి అందుబాటులోకి వచ్చింది.

- అక్షరటుడే, ఇందల్వాయి




## ఇక ఇంటి నుంచే

# యూరియా బుకింగ్

▸ మొబైల్ యాప్ ద్వారా కొనుగోలు ▸ నేటి నుంచి అందుబాటులోకి.. ▸ యూరియా పక్కదారి పట్టకుండా పక్కా ప్రణాళిక

రైతులు గతంలో లాగా ఒకేసారి కాకుండా యూరియాను విడతల వారీగా కొనుగోలు చేయాల్సి ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఐదు ఎకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులు రెండు విడతల్లో, ఐదు ఎకరాల నుంచి 20 ఎకరాలు ఉన్నవారు మూడు విడతలు యూరియ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. 20 ఎకరాలపైన ఉన్నవారు నాలుగు దఫాలు బుక్ చేసుకోవాల్సి వస్తుంది. ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత మళ్లీ 15 రోజులకు తెప్పించుకునే అవకాశం రైతులకు ఉంటుంది. యూరియా బుకింగ్ యాప్‌లో పాస్ పుస్తకం నంబర్ నమోదు చేయగానే లింక్ చేసిన ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. అది నమోదు చేసి అడిగిన సమాచారం అందులో పొందుపరిస్తే బుకింగ్ ఐడీ వస్తుంది. యాప్‌లో బుక్ చేసుకున్న తర్వాత తమకు జనరేట్ అయ్యే నెంబర్ ఆధారంగా తమ రిటైలర్ వద్ద కాకుండా పక్క గ్రామంలోని దుకాణంలోనూ ఎరువులు పొందవచ్చు. ఈ యాప్ ద్వారా కవులు రైతులకు సైతం అవకాశం కల్పించారు. కౌలు రైతు యూరియా బుక్ చేసుకుంటే భూ యజమానికి ఓటీపీ వెళ్తుంది. ఈ ఓటీపీ కేవలం 24 గంటలు మాత్రమే ఉంటుంది. ఆలోపు కౌలు రైతు ఎరువులు తీసుకెళ్లాల్సి వస్తుంది.

### అవసరం మేరకే..

యూరియా పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని అధికారులు చెబుతున్నారు. గతంలో రైతులు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయడంతో కొరత ఏర్పడేది. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు రైతు పూర్తి వివరాలు యాప్‌లో పొందుపరుస్తున్నారు. దీంతో అనవసరంగా ఎక్కువ మొత్తంలో యురియా కొనుగోలు చేసేందుకు రైతులకు అవకాశం లేకుండా పోయింది. కొందరు అవసరానికి మించి కొనుగోలు చేసి బంధువులకు సరఫరా చేసేవారు. ఇక నుంచి రైతులకు అవసరం ఉన్నంత వరకు మాత్రమే ఎరువులు తీసుకోవాల్సి వస్తుంది.

### డివిజన్ల వారీగా జిల్లా వివరాలు

జిల్లాలో మొత్తం ఐదు వ్యవసాయ డివి జన్లు, 106 క్లస్టర్లు ఉన్నాయి. 33 మండలాల్లో రైతుల సంఖ్య 2,91,749 కాగా సాగుభూమి 5.40 లక్షల ఎకరాలు ఉందని యూరియా 80 వేల మెట్రిక్ టన్నులు మేరకు అవసరం ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

### రైతుల సౌకర్యార్థం..

రైతుల సౌకర్యార్థమే మొబైల్ యాప్ ద్వారా యూరియా పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి. గతంలో లాగా వరుసలో వేచి ఉండకుండా ఇంటి నుంచే అవసరం మేరకు బుక్ చేసుకోవాలి. – **శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి**

## కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ బృందం




**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ అధ్యక్షుడు వినయ్ కృష్ణారెడ్డిని రెడ్ క్రాస్ బృందం శనివారం మర్యాదపూర్వకంగా కలిసింది. మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికలను దిగ్విజయంగా నిర్వహించినందుకు సొసైటీ సభ్యులు పూలమొక్క ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, ప్రతినిధులు రవీందర్, అబ్బాపూర్ రవీందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గణితమే జీవితగమనం



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** గణితమే జీవన గమనమని.. ఆ సబ్జెక్టుపై భయం పోగొట్టుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో ఆంధ్రయ్య పేర్కొన్నారు. రామానుజన్ జయంతిని పురస్కరించుకుని కమ్మర్‌పల్లి ఎమ్మార్సీలో మండలస్థాయి గణిత ప్రతిభ పాటవ పరీక్షను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితం యొక్క గొప్పతనాన్ని వివరించారు. గణిత సబ్జెక్టులో పూర్తిస్థాయి పట్టుసాధిస్తే అన్ని అంశాలను ముందంజలో ఉండవచ్చని స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేయాలని సూచించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్ఎంలు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సర్పంచ్ దంపతులకు ఘన సన్మానం

**అక్షరటుడే,ముప్కాల్:** రెంజర్ల గ్రామంలో నూతనంగా సర్పంచ్‌గా ఎన్నికైన బొమ్మెన లావణ్య-భూమేశ్వర్ దంపతులకు శనివారం గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. ప్రజల ఆశయాలకు అనుగుణంగా సర్పంచ్ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ.. గ్రామ సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ బొమ్మెన లావణ్య తెలిపారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో దొరికిన అంబులెన్స్ డ్రైవర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** అంబులెన్స్ డ్రైవర్ డ్రంకన్ డ్రైవ్‌లో దొరికాడు. నిజామాబాద్ నగరంలోని వర్ని చౌరస్తా వద్ద డ్రంక్ ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 15 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికిపోయారు. ఇందులో ఓ అంబులెన్స్ డ్రైవర్ కూడా ఉండటం గమనార్హం. పోలీసులు వారి వాహనాలను స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు.

### పేషెంట్ లేకున్నా సైరన్..

నాగారం ప్రాంతానికి చెందిన ముదునూరి నాగరాజు అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మద్యం తాగి అంబులెన్స్ నడపడమే కాకుండా.. రోగులు లేకున్నా సైరన్ మోగిస్తూ న్యూసెన్స్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ క్యాన్సిల్ చేయడాలని ఆర్టీవో అధికారులకు పంపుతామన్నారు.

## పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన

**అక్షరటుడే, ఇందల్వాయి :** ఆరోగ్యవంతమైన జీవన విధానానికి పౌష్టికాహారం ఎంతో అవసరమని చంద్రాయన్ పల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని తల్లిదండ్రులకు హెచ్ఎం శ్రీనివాస్ వివరించారు. విద్యార్థులకు నిత్యం అందించే ఆహార పదార్థాలు కాకుండా పౌష్టిక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తే కలిగే లాభాల గురించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు బోధించారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం



ఎంతో ముఖ్యమని సమతుల్యమైన ఆహారాన్ని అందిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పాఠశాలలోని ప్రతి విద్యార్థి తమ ఇంట్లో వివిధ రకాల పౌష్టికాహార వంటకాలను చేయించి పాఠశాలలో ప్రదర్శించారు.

## విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి : ఎస్సై సందీప్

**భీమ్‌గల్, అక్షరటుడే :** విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని భీమ్‌గల్ ఎస్సై సందీప్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో శనివారం సైబర్ భద్రత, మాదకద్రవ్యాల నివారణ, సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ.. నేటి కాలంలో బాలబాలికలపై జరుగుతున్న అకృత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యుక్తవయసులో ఉన్న విద్యార్థినులు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మంచి చెడులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏఆర్ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇంటర్ దశ జీవితానికి అత్యంత కీలకమన్నారు.




ఈ సమయంలో గందరగోళానికి లోనుకాకుండా చదువుపై ఏకాగ్రత వహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.జయపాల్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ మండలోజు నర్సింహ స్వామి, పల్లె శ్రీనివాస్ గౌడ్‌లు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మయ్య, కానిస్టేబుల్ విక్రమ్, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ ఆధ్వర్యంలో మధుమేహ నిర్ధారణ శిబిరం

**అక్షరటుడే, ఇందూరు:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో శనివారం ఉదయం వాకర్లకు షుగర్ టెస్టులు చేశారు. అనంతరం షుగర్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యల గురించి లయన్స్ జిల్లా అదనపు కోశాధికారి పి.లక్ష్మీనారాయణ వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్బాయి లింబాద్రి, పూర్వాధ్యక్షుడు చింతల గంగాదాస్, ప్రోగ్రాం చైర్మన్ షేక్ ఖాదర్ బాషా, లయన్స్ ఆరోగ్య విభాగం జిల్లా చైర్మన్ కరిపె రవీందర్, రీజియన్ పూర్వ చైర్మన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## టీడీపీ మద్దతుదారులైన వార్డు మెంబర్లకు సన్మానం

**అక్షరటుడే,లింగంపేట:** మండలంలోని ముంబాజీపేటలో టీడీపీ మద్దతుదారులైన వార్డు మెంబర్లను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ లింగంపేట మండల అధ్యక్షుడు భీమ్‌రావు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గం గతంలో తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉండేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలుగుదేశం పార్టీ కనుమరుగు అయినప్పటికీ పార్టీపై అభిమానం ఉన్నవాళ్లు చాలామంది ఇప్పటికీ ఉన్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం మద్దతుదారులైన గుర్రపు లావణ్య కాశీరాం, కిషన్ చంద్, చిన్నోళ్ల మంజుల వార్డు సభ్యులుగా గెలుపొందడం అభినందనీయమన్నారు. తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షులు విశ్వేశ్వర శర్మ, వెంకట్ రెడ్డి, కమ్మరి కృష్ణ, రాజు, గోపాల్, తిరుమల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

